"కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నర శార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్—

## ''హే శ్రీరామచంద్ర ప్రభో!

తూర్పు తెల్లవారుచున్నది. దిన కృత్యములు నెరవేర్ప వలయును. దయచేసి నిద్రలెమ్మ!'' అంది నాటకీయంగా విజయలక్ష్మి.

నిండుగా ముసుగు దన్ని పడుకొని ఉన్న శ్రీరామచంద్రమూర్తి (అతని పేరు అదే) లేవలేదు. అతను నిద్ర పోవటం లేదుకాని, అప్పుడే లేవటానికి బద్ధకిస్తున్నాడు. ఆ సంగతి గ్రహించిన విజయ! ''సుప్రభాతం పూర్తిగా వినిపించుకొని లేవాలని ముచ్చట పడుతున్నారేమో స్వామివారు! నాకు వచ్చింది ఈ ఒక్క శ్లోకమే. తరువాయి భాగం చూస్తైనా చదువుదామంటే పుస్తకం లేదు. కాదూ కూడదంటే పక్కఇంటి బామ్మగార్ని పిలుచుకు వచ్చి చదివిస్తాను మరి!'' అంది హాస్యధోరణి కొనసాగిస్తూ.

ముసుగు తొలగించలేదు మూర్తి. చలికాలం—ఏడు గంటలు పొద్దెక్కేదాకా నిద్ర మంచం మీదే గడపటం అతనికి అలవాటు. వివాహం అయిన తరవాత కూడా అతని కా అలవాటు మారలేదు. సాగితే అంతకన్న సౌఖ్యం లేదు కాని, అప్పుడప్పుడు అవసరాలు అంతరాయం కలిగిస్తూంటాయి. ఈ వేళా అదే జరిగింది.

''లెమ్మ, పతిదేవా!'' అని బలవంతంగా దుప్పటి లాగి పారేసింది విజయ.

కళ్ళు తెరిచి, ''టై మెంతైందీ?'' అనడిగాడు మూర్తి బద్ధకంగా.

''మన అలారానికి అబద్ధం చెప్పటం రాదు—ఆరు చూపిస్తూంది.''

''అప్పుడే తొందరే మొచ్చింది!'' అని చెయ్యి పట్టి ఆమెను తన మీదికి లాక్కున్నాడు మూర్తి.

''బాగుంది సరసం! అవతల ట్రెయిన్‌కి టైమైపోతూంది!'' అంటూ అతని పట్టు నుండి విడిపించుకొని, లేచిపోయింది విజయ.

''ట్రెయినేమిటి? టైమై పోవట మేమిటి?'' కించిత్తు ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మూర్తి.

''మతి మరుపు ప్రొఫెసర్లకి రాణిస్తుంది కాని, లెక్చరర్లకు కాదు. ఈ వేళ ఎనిమిది గంటల ట్రెయినుకు పంపిస్తానని చెప్పింది విన్నదేగా? ఇంతలోనే మతి మరుపా! ఉత్త మతిమరుపేనా, లేక...''

''ఆగు, ఆగు...మాట పూర్తి చేసి నా నిజాయితీని శంకించి, నా సత్యశీలానికి కళంకం ఆపాదించకు. ఆడిన మాట తప్పటం ఆనాడే కాదు, ఈ నాడూ అలవాటు లేదు. శ్రీరామచంద్రుడుది ఒకటే బాణం, ఒకటే మాట. మరుపు అన్నది మానవ సహజం. అది క్షంతవ్యమే!'' అంటూ హుషారు తెచ్చుకుని, మంచం దిగాడు మూర్తి.

కాలకృత్యాలు ముగించుకొని, టిఫిన్, కాఫీ పూర్తి చేసి, చక్కగా డ్రెస్ చేసుకుని, సువారు ఒక గంటలో రిక్షాలో స్టేషన్‌కు బయలు దేరారు ఇద్దరూ.

మూర్తి, విజయలది ప్రేమ వివాహం. ఆరు నెలల క్రితమే జరిగింది. ఇరు వైపుల స్నేహితుల్లోనూ, బంధువుల్లోనూ పెద్ద సంచలనాన్ని కలిగించింది. అందర్నీ ఆశ్చర్యంలో ముంచి వేసింది.

మూర్తి చేస్తున్నది కాలేజీలో తెలుగు లెక్చరర్ ఉద్యోగం. లెక్చరర్‌గా అతనికి మంచి పేరు ఉంది. అటు విద్యార్థులలోనూ, ఇటు తోటి లెక్చరర్లలోనూ అతని పట్ల గౌరవ భావం, సదభిప్రాయం ఉన్నాయి. క్లాసులో పాఠం చెపుతున్నంత సేపూ అతని కంఠం కంచులా మోగుతుంది. విద్యార్థుల్ని మంత్రముగ్ధుల్ని చేసి ఆకట్టుకోగల నేర్పూ, వాక్చాతుర్యమూ అతనికి ఉన్నాయి. కాని, బయట అతను మిత భాషి. ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడటం కాని, కలుపుగోలుగా తిరగడంకాని కనుపించదు. అందరితోనూ అంటీ ముట్టనట్టుగా ఉంటాడు. ఉద్యోగం, పుస్తకాలు మరొక ధ్యాసే ఉండదతనికి.

లెక్చరర్ ఎంత గొప్పవాడూ, మంచివాడూ అయినప్పటికీ, ముద్దు పేర్లు పెట్టకుండా వదలరు విద్యార్థులు. మూర్తికి రెండు, మూడు ముద్దు పేర్లున్నాయి—బాటసారి, బుద్ధావతారం వగైరాలు.

ఇంక విజయ—ప్రారంభం నుంచి కో-ఎడ్యుకేషన్ స్కూళ్ళలోనే చదివింది. కాలేజీలో చేరి నాలుగేళ్ళయింది. బి. ఎ. చివరి సంవత్సరంలోకి వచ్చినా, ఇంకా ఆ వాతావరణానికి అలవాటు పడనట్టే కనుపిస్తుంది. ఆమెకు తగని సిగ్గు. మగపిల్లల్ని చూస్తే అత్తపత్తిలా ముడుచుకు పోతుంది.


శ్రీరామచంద్రమూర్తి పని చేస్తున్నదీ, విజయలక్ష్మి చదువుతున్నదీ ఒక కాలేజీలోనే. వాళ్ళిద్దరి మధ్య ఉన్న సంబంధం అప్పటికి అంతవరకే. విజయ బి. ఎ ఆఖరి సంవత్సరం పరీక్షలు వ్రాసిన మరునాటి రోజునే అచ్చైన శుభలేఖలో వరుడు చిరంజీవి శ్రీరామచంద్రమూర్తి వధువు చిరంజీవి సౌభాగ్యవతి విజయలక్ష్మి అని ఉంది.

'శుభలేఖలు' అందుకున్న ఇరు పక్షాల బంధు మిత్రులకు వధూవరుల విషయమై ఎలాంటి అసంతృప్తి కలగలేదు. కాని, ఇది ప్రేమ వివాహం అని తెలిసినప్పుడు మాత్రం నమ్మ శక్యం కాలేదు.

'బాటసారి' సినిమాలో నాగేశ్వరరావులా కళ్ళజోడు పెట్టుకుని, ఎప్పుడూ పుస్తకాలతో మైత్రి నెరపే శ్రీరామచంద్రమూర్తి ఒక ఆడ పిల్లకు ప్రేమలేఖ వ్రాశాడంటే, అతన్ని ఎరిగి ఉన్న వాళ్ళెవ్వరూ నమ్మక పోవచ్చు. అలాగే వంచిన తల ఎత్తకుండా లోడ్డు వెంట నడిచే విజయలక్ష్మి ఒక లెక్చరర్‌తో ప్రేమాయణం సాగించి, పెళ్ళి వరకు తీసుకు వచ్చిందంటే, ఆమె స్నేహితురాళ్ళు విశ్వసించక పోవచ్చు. కాని, జరిగింది అదే.

ఎవ రెంత ఆశ్చర్య పోయినా, ఇరు పక్షాల పెద్దలకూ అభ్యంతరం లేకపోవటంతో ఘనంగా పెళ్ళి జరిగి పోయింది.

సంభవం అనుకున్నది ఒక్కొక్కసారి అసంభవం కావటం, అసంభవం అనుకున్నది సంభవం కావటం—ఇదే కదా విధి విలాసం అంటే? అని అందరూ



# శృంగార నాయికలు

## స్వాధీనపతిక

-చంద్రం




సమాధానపడ్డారు.

మూర్తి, విజయ వేసవి సెలవుల్లోనే దంపతులయారు.

విజయ బి. ఏ. పాసైంది.

కాలేజీలు తెరిచారు.

మూర్తికి అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ అయింది.

కొత్త సంసారం ఈ ఊళ్ళో ప్రారంభం అయింది.

ప్రస్తుతం విజయ పుట్టింటికి ప్రయాణమైంది. అదే ఊళ్ళో ఉంటున్న వాళ్ళ పినతండ్రి కూతురు శ్యామల వివాహం. పెళ్ళి ఇంకా వారం రోజులు ఉంది. దగ్గర బంధుత్వం కనక మగి పెళ్ళినాడే వెళితే బాగుండదనీ, ఎలాగా

సందర్భం వచ్చి వెళుతూంది కనక పుట్టింటి దగ్గర నాలుగు రోజులు గడప వచ్చుననీ కాస్త ముందుగా బయలు దేరింది విజయ. భర్తను కూడా ఒక వారం రోజులు సెలవు పెట్టి తనతో బాటే రమ్మంది. అతగాడు కూడా సెలవు కోసం ప్రయత్నించాడు కాని, మంజూరు కాలేదు. విజయ ఒక్కర్తే వెళ్ళక తప్పలేదు.

రిక్షా స్టేషన్ చేరేంత వరకు—దారి పొడుగునా తను తిరిగి వచ్చేంత వరకు ఆహార విహార నిద్రాదులలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి భర్తను హెచ్చరిస్తూనే ఉంది విజయ. ముఖ్యంగా ఇరుగు పొరుగు అమ్మలక్కలు పంపించే కూరలూ, పచ్చళ్ళూ మొహమాటపడి తీసుకోవద్దని గట్టిగా చెప్పింది. పనిపిల్ల సాయం ఉంటుంది కనక బుద్ధిగా వంట చేసుకోమనీ, అంత ఓపిక లేకపోతే హొటల్లోనే భోజనం చెయ్యమనీ మరీ మరీ చెప్పింది.

అన్నింటికీ అలాగే లెమ్మని తల ఊపేశాడు మూర్తి. బండి కదిలేటప్పుడు— "సాధ్యమైనంత త్వరగా వచ్చేయ్!" అన్నాడు క్లుప్తంగా.

"అలాగే!"

"వెళ్ళిన వెంటనే ఉత్తరం రాస్తావు కదా?"

"అలాగే. . . అలాగే. . ."

బండి వెళ్ళి పోయింది.

* * *

విజయ, శ్యామల అన్నదమ్ముల బిడ్డలేకాక, క్లాస్ మేట్సు కూడాను. వీళ్ళ ఈడు వాళ్ళే మరో నలుగు రైదుగురు ఆడపిల్లలు— అందులో కొందరు వివాహితలు, కొందరు అవివాహితలు— అందరూ కలిసి విజయ వెళ్ళిన మరునటి రోజున శ్యామల గదిలో చేరి పిచ్చాపాటీ మాట్లాడుకో సాగారు. వీళ్ళంతా ఒక క్లాసు వెనకా ముందుగా ఒకే కాలేజీలో చదువు కున్నారు. వీళ్ళందరికీ శ్రీరామచంద్రమూర్తి పరిచితుడే.

"అన్నట్టు, అడగటం మరిచాను. మీ పతిదేవులు వేంచేయలేదా, విజయా?" అని అడిగింది సుశీల. సుశీల వివాహిత.

"లేదు."

"బాటసారి మాస్టారికి కొత్త బిరుదు లేమన్నా ప్రదానం చేశారా అక్కడి స్టూడెంట్సు? లేక ఇంకా పాత పేర్లతోనే వ్యవహరింప బడుతున్నారా?" నవ్వుతూ అడిగింది మాధవి. మాధవి అవివాహిత.

విజయకు కొంచెం కోపం వచ్చింది. "పేర్లకేం తక్కువ! ఎన్నైనా పెడతారు. పిలిచే వాళ్ళకు బుద్ధి ఉండాలికాని, పిలవబడే వాళ్ళ నష్టపోయే దేమీ ఉండదు. అల్లరి చిల్లరి వేషాలు వేసే పోకిరీ వెధవలకు పేర్లు పెడితే అదొక ముచ్చట. తన పనేదో తను చూసుకొని, తల వంచుకుపోయే బుద్ధిమంతులకు కూడా నిక్‌నేమ్స్ తగిలించి గేలి చెయ్యటం— మన అవివేకానికీ, కుసంస్కారానికీ నిదర్శనం తప్ప మరొకటి కాదు. గుర్రాన్నీ, గాడిదనూ ఒకేలా చూడటం మన కలవాటై పోయింది. అంత మాత్రాన గుర్రం గాడిద కాదు, గాడిద గుర్రమూ కాదు. మన మనస్తత్త్వం బయట పడుతుం దంతే!" ఉద్రేకంగా అనేసింది విజయ.

"హియర్! హియర్! అక్షర లక్షలు విలువ చేసే మాటలు చెప్పిందమ్ విజయ! హేట్సాఫ్ టు విజయ!" అంది నాటకీయంగా పోజు పెట్టి సుజాత. సుజాత కూడా అవివాహితే. ఆమె మాటలకు అందరూ పగలబడి నవ్వారు.

విజయకు కోపం పెరిగి పోయింది. అయినా, తమాయించుకుంది.

"బాటసారి మాస్టారు నీ భర్త స్థానంలో ఉండబట్టి నీ కిప్పుడు కోపం వస్తూంది కాని, ఒకప్పుడు నువ్వూ అయన్ను ఆ పేరుతోనే 'గఫర్' చేసే దానివిగా?" గుర్తు చేసింది సుశీల.

"ఇప్పుడు మాత్రం ఇందులో తప్పేముందే? భర్త మీద ఈగను కూడా వాలనివ్వకూడదన్న పతివ్రతల సెంటిమెంటుతో ఇది ఇలా బాధ పడుతూందిగాని!" అంది మాధవి మళ్ళీ.

"అంతేనా, విజయా? అయితే, నిశ్చింతగా ఉండు. అనసూయా అరుంధతుల లిస్టులో నిన్నూ చేర్చేసుకుంటాం!" — సుజాత.


# రాన్‌బాక్సీవారి గార్లిక్ పెర్ల్స్

సంపూర్ణారోగ్యానికి సహజ పద్ధతి

## పచ్చి వెల్లుల్లి తినకూడదా?



వెల్లుల్లి రసం శరీరంలో నిప చేయాలంటే పొట్టు తీసిన వెల్లుల్లిపాయలను బాగనమలాలి. నమిలితే నోరంతా పచ్చి వెల్లుల్లివాసన. నమలకుండా మింగితే అవి జీర్ణంకావటం కష్టం. అందులోని రసమంతా శరీరంలోకి రాదు.

## వంటలో వెల్లుల్లివాడితే చాలదా?



వండటంతో వెల్లుల్లిలోని ఔషధ గుణాలు నశిస్తాయి.

వెల్లుల్లిలోని ఔషధగుణాలు అనాదినుండి తెలిసినవే. అన్నిరకాల అనారోగ్యాలను పోగొట్టటంలో వెల్లుల్లివిలువను వైద్యనిపుణులు గుర్తించారు. వెల్లుల్లిని వంట కాల్లో వాడవచ్చు. పచ్చి వెల్లుల్లి తినవచ్చు. కాప్స్యూల్ రూపంలో తీసుకోవచ్చు. అయినా సాధ్యమయినంతమేరకు వెల్లుల్లిలోని ఔషధగుణాలను పొందేందుకు దానిని గుణం కనబరిచేట్టువాడాలి

## రాన్‌బాక్సీవారి గార్లిక్ పెర్ల్స్ ఎందుకు వాడాలి?

రాన్‌బక్సీ పరిశోధన శాలలకు వైద్య ప్రపంచంలో మంచి పేరుంది. పచ్చి వెల్లుల్లిలోని సుగుణాలన్నీ వాసనలేకుండా మీకు లభించేట్టు తయారు చేశారు. శుద్ధమయిన పచ్చి వెల్లుల్లి రసంలో వాసన పోగొట్టి, సులభంగా జీర్ణమయ్యే మెత్తటి కాప్స్యూల్స్‌ను వెల్లుల్లిలోని ఔషధ గుణాలు ఉత్తమ పద్ధతిలో లభించేట్టు తయారు చేశారు.

రెండేసి గుళికలు రోజుకు రెండుసార్లు కమంతప్పకుండా తీసుకోండి.

రాన్‌బాక్సీవారి గార్లిక్ పెర్ల్స్

- ఉబ్బరము, అజీర్తి మాయమవుతాయి. గుండెలలో మంట తగ్గుతుది.
- కొలెస్టరల్ స్థాయి తగ్గుతుంది.
- కీళ్ళనొప్పులు తగ్గుతాయి.
- తరుచు జలుబు, దగ్గురాకుండా రక్షణ కలుగుతుంది.

రాన్‌బక్సీస్ గార్లిక్ పెర్ల్స్ ప్రతిరోజు సేవించండి ఇది మంచి అలవాటు.




## మీరు తెలుసుకోవలసిన కొన్నియదార్థాలు

aslan/RGP3/BC/TEL

"కొంపదీసి సతీ సావిత్రిలా సూర్యోదయం ఆగి పోవాలని శపించేవు కనక శ్యామల బెంగ పెట్టుకుంటుంది — ఎక్కడ పెళ్ళాగి పోతుందో అని! అసలే అది క్షణ మొక యుగంలా గడుపుతూంది. ముహూర్త సమయం కోసం..."— సువర్చల. ఈమె కూడా అవివాహితే.

"ఇంతకూ నీ భర్త మంచివా డంటావ్! అంతేనా?" సుశీల.

"మంచివాడుకాక చెడ్డవాడనా నీ ఉద్దేశం?" చురుగ్గా చూస్తూ అడిగింది విజయ.

"పాపము శమించుగాక! భర్తను వాడు వీడు అనటం సతీధర్మం కాదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. భర్తను గౌరవించాలి." మధ్యలోనే అందుకుంది మాధవి.

"గౌరవం అనేది అంతరాంతరాల్లోంచి పుట్టుకు రావాలి కాని, ఒక్క మాటల్లోనే ఉంటే సరిపోదు." — విజయ.

"ఇంతకూ నువ్వు మాస్టార్ని ఏక వచనంలో సంబోధిస్తావా? బహు వచనంలోనా?" కుతూహలంగా అడిగింది సుజాత.

"సంబోధనలు మాట్లాడుకొనే వాళ్ళకుగాని వీళ్ళకెందుకే!"— మాధవి.

"అదేం, పాపం? వీళ్ళు మాట్లాడుకోరా?"— సుజాత.

"వీళ్ళది మూగ ప్రేమ. మాటలతో పనేముంటుంది? ఒక వేళ ఎప్పుడన్నా అవసరమైనా, మాటల కంతగా ప్రాధాన్యం ఇవ్వ రనుకుంటా వీళ్ళు. అది సరే. ఇప్పుడు నా కో ముఖ్యమైన విషయం గుర్తొచ్చింది."

ఏమిటో అన్నట్టు కుతూహలంగా మాధవి వేపు చూశారు అందరూ—విజయ కూడా.

"అయస్కాంత లక్షణాలలో 'సజాతి ధ్రువాలు వికర్షించు కొనును' అని చదువుకున్నాము. ఆ సిద్ధాంతం తప్పు అని ఈ అపూర్వ ప్రేమికులు నిరూపిస్తున్నారు."

మళ్ళీ పకపకలు, వికవికలు.

ఇంక నిగ్రహించుకోలేక పోయింది విజయ. పరిహాసానికైనా ఒక పరిమితి ఉండాలి కదా? విసురుగా లేచి పోయింది.

విజయకు కోపం వచ్చిందని గ్రహించిన కామేశ్వరి— ఈమెకు రెండేళ్ళ క్రితమే పెళ్ళి అయింది. ఒక కొడుకు కూడాను— చెయ్యి పట్టి కూర్చొబెడుతూ," అప్పుడే లేచిపోయావేం? కాస్సేపు కూచో" అంది.

"వెళతానులే. పని ఉంది" అంది మళ్ళీలేస్తూ విజయ, బింకంగా.

కామేశ్వరి లేవనివ్వలేదు. "ఏళ్ళేదో సరదాగ అంటే నువ్వు చిన్న పిల్లలా కోపం తెచ్చుకోవటం ఏమీ బాగా లేదు. మాస్టారు మా కందరికీ తెలిసిన వ్యక్తి కనక ఏళ్ళిలా మాట్లాడారుకాని, అదే మా ఆయన గురించో, సుశీలా వాళ్ళాయన గురించో అయితే మాట్లాడ గలరా? కూర్చో కూర్చో."

కూర్చోక తప్పలేదు విజయకు.

స్వతహాగా మెతక మనిషి విజయ. ఆమె మెతకతనాన్ని అలుసరాగా తీసుకొని తరుచు వీళ్ళు ఆమెను ఆట పట్టించటం, ఆమె ఉడుక్కోవటం మామూలే.

కామేశ్వరి ప్రయత్నంవల్ల తరవాత వాతావరణంలో కాస్త మార్పు వచ్చింది. వ్యక్తిగత విషయాలను వదిలి, కామన్ టాపిక్స్ వైపు మళ్ళింది వాళ్ళ సంభాషణ.

మాటలతో తగిన విధంగా వాళ్ళను ఎదుర్కోలేక పోతున్నా నన్న ఉక్రోషం తప్ప, వ్యక్తిగతంగ వాళ్ళంటే ద్వేషం లేదు విజయకు. చిన్ననాటి నుండీ ఒక్కచోట పెరిగి, ఒకరి అభిరుచులు ఒకరికి తెలిసిన ప్రాణస్నేహితు రాళ్ళు వాళ్ళు.

ఆ సంభాషణ చాలాసేపు కొనసాగింది. అందులో విజయకు తెలిసిన ముఖ్యమైన అంశాలు కొన్ని ఉన్నాయి.

మీ కేశ సౌందర్యాభివృద్ధికి కొబ్బరినూనె కంటె అతి ఉత్తమమైనదేది?

**కేశవర్ధినిని**
చేర్చిన కొబ్బరినూనె

OBM 6119/TG




ఔను! మీరు ప్రతి నిత్యమూ తలకు రాసుకుంటూన్న కొబ్బరినూనెలో కొన్ని చుక్కలు కేశవర్ధినిని కలపండి. తల చర్మానికి అంటేటట్టుగా తలకు రాసుకోండి. ఇదే అందంగా తల వెంట్రుకలు పెరగడానికి సాంప్రదాయిక రహస్యము- కేశవర్ధిని. వెంటనే ఒక బాటిల్ కేశవర్ధినిని కొని వాడండి.

కేశవర్ధిని ప్రొడక్ట్స్
మద్రాసు-600 087

ఈ సంఘంలో తాగుబోతులు జూదగాళ్ళు వ్యభిచారులు భార్యల్ని తిట్టే వాళ్ళు కొట్టే వాళ్ళు హింసించే వాళ్ళు అనుమానించే వాళ్ళు అవమాన పరిచే వాళ్ళు ఇన్ని రకాల భర్తలు ఉంటారంటే ఆశ్చర్య పోయింది విజయ.

సుశీల భర్త తాగుతాడట!

కామేశ్వరి వాళ్ళాయనకు ఆడపిల్లల పిచ్చి జాస్తి అట!

సుజాత వాళ్ళ మేనత్త కూతురి మొగుడికి భార్య పైన చెప్పలేనంత అనుమానం అట! భార్యను ఎక్కడికీ ఒంటరిగా పంపడట—పుట్టింటికైనా సరే. ఆఫీసుకు సెలవు పెట్టి తనూ వెంట వస్తాడట, బాడీగార్డులా!

మాధవి వాళ్ళ పక్క ఇంటాయన రోజూ భార్యను బండ బూతులు తిడుతూ, చితక బాదుతూంటా డట!

సువర్చల వాళ్ళ బావగారు పెళ్ళయి నాలుగేళ్ళయినా, ఇంకా ప్రతి పండగకూ అత్త వారింటికి వచ్చి, అలక పాన్పు లెక్కుతాడట. పుట్టింటి నుండి డబ్బు తెమ్మని భార్యను సతాయిస్తూంటాడట!

నమ్మ శక్యం కాలేదు విజయకు. ఇలాంటి భర్తలు ఉంటారన్న సంగతి వినటం ఇదే ప్రథమం కాదు విజయకు. కాని, విన్న ప్రతిసారీ అమితమైన ఆశ్చర్యం కలుగుతూంటుం దామెకు. ఇలాంటి దుర్మార్గులైన భర్తలతో కాపురం చేసే భార్యలు ఏం సుఖపడతా రన్నదే విజయ సందేహం.

తన భర్త శ్రీరామచంద్రమూర్తి నిజంగా దేవుడే. అతనిలో ఇలాంటి దుర్గుణాలు మచ్చుకు ఒక్కటైనా లేకపోగా, ఎన్నో సద్గుణాలు—ఈనాటి యువకులు అలవరుచు కోవలసిన ఎన్నో ఆదర్శాలు— ఉన్నాయి.

భర్తకు సంబంధించిన మధురమైన ఊహలతో సంతృప్తిగా లేచింది విజయ.

సమయం సాయంత్రం ఆరు గంటలు కావ స్తూంది.

నెమ్మదిగా అడుగులు వేస్తూ ఇల్లు చేరిన విజయ ముందు గదిలో కుర్చీలో కూర్చుని, పుస్తకం చదువుతున్న వ్యక్తిని చూసి ఆశ్చర్య పోయింది.

విజయ రాకను గమనించి— "నేనే!" అన్నాడు చిన్నగా నవ్వుతూ, మూర్తి.

"ఇది కలా! వైష్ణవ మాయా?" పైకే అనే సింది విజయ.

"రెండూ కాదు; వాస్తవమే ఇది. కావాలంటే గిల్లు తాను—చూడు!" అంటూ దగ్గరికి వచ్చి చిన్న పిల్లవాడులా చేతిమీద గిల్లాడు కూడాను.

"ప్రిన్సిపల్ రాక్షసుడు సెలవిచ్చాడా మరి?"

"సిక్ లీవ్ పెట్టేశా."

కారణం ఏమిటని అక్కడే నిలేసి అడగలేదు విజయ.

భోజనాలు అయిన తరువాత గదిలో రహస్యం చెప్పాడు మూర్తి. "మన పని పిల్ల మహా ప్రమాద కరమైన మనిషి సుమా! నిన్న పని వంకతో పొద్దు గూకినా ఇల్లు వదిలింది కాదు. వెళ్ళిపొమ్మంటే నాభోజనం అయిన తరవాత వెళతానంది. భోజనం అయినాక గిన్నెలు కడగాలంది. తరవాత వంటిల్లు సర్దాలంది. అలాంటివేమీ అక్కర్లేదు, వెళ్ళి పొమ్మంటే— వోరగా చూసి, వెకిలిగా నవ్వుతుంది. నువ్వు ఊరు వెళుతూ నా బాధ్యత అంతా తనకే అప్పగించావనీ, నాకే లోటూ రాకుండా చూడ వలసిన అవసరం తనకు ఉన్నదనీ—ఏమి టేమిటో వాగు తుంది. అనవసరంగా మాటలు పెంచుతుంది. ఆ మహాశక్తిని వదిలించు కోవటానికి నానా యాతనా పడవలసి వచ్చింది. చివరికి చావు తప్పి కన్ను లొట్ట పోయిందంటారే—అలా అయింది నా పని. దాని మనస్తత్వం అర్థమైన తరవాత కూడా దానికి అవకాశం ఇవ్వటం బుద్ధి తక్కువ అనీ, మొదటి రోజునే అంత రభస చేసిన మనిషి రెండవ రోజున ఇంకేం చేస్తుందోననీ తెల్లవారకముందే ఇల్లు వదిలి, డాక్టర్ సర్టిఫికెట్ కాలేజీకి పంపించి, ఇలా పారిపోయి వచ్చేశా."

"పని పిల్లకు జడిసి ఎవరన్నా పారిపోయి వచ్చేస్తారా? నేనలాంటి వాణ్ని కానని చెప్పి, నాలుగు చివాట్లు పెట్టి పంపించెయ్య వచ్చుగా?"

"మొదట నేనూ అలాగే చేద్దామనుకున్నాను. కాని, చిత్రాంగి సారంగధరుల కథ గుర్తువచ్చి, ఆ ప్రయత్నం విరమించుకున్నా. రాత్రంతా బాగా ఆలోచించి, ఉభయ తారకంగా ఉంటుందని ఈ పని చేశా!" అంటూ విజయను కౌగిలిలోకి తీసుకున్నాడు మూర్తి. *

(భర్త తన అధీనుడై ఉన్న నాయిక, పర స్త్రీలను కాంక్షింపక, తనయందే అనురక్తుడైన పతి కలది -స్వాధీన పతిక.)

**వచ్చే వారం**
**'వాసకసజ్జిక'**


## జాతీయ భాషా సమైక్యతా గ్రంథములు

తెలుగు భాష మాత్రము చదవగలిగినవారు యితర రాష్ట్రములకు పోయి ఆ దేశములో స్థిరపడిన తరువాత వ్యాపారము గాని, విద్యా సంస్థలయందు గాని, ఉద్యోగ సంస్థలయందు గాని ఆ దేశ ప్రజలతో వ్యవహరించుటకు కష్టపడేవారికి, దినచర్యకు ఉపయోగించే వార్తలు చేర్చి, సులభంగా వ్యాకరణ లోపం లేకుండా వ్రాయడానికి, చదవడానికి మరియు ఆ దేశ ప్రజలతో తేలికగా వ్యవహరించుటకు, ఈ క్రింది వివరించబడిన ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ. | | వెల రూ. |
|---|---|---|---|
| 30 రోజులలో హిందీ భాష | 4-50 | 30 రోజులలో మరాఠి భాష | 4-50 |
| 30 రోజులలో కన్నడ భాష | 4-50 | 30 రోజులలో గుజరాతీ భాష | 5-50 |
| 30 రోజులలో మలయాళ భాష | 4-50 | 30 రోజులలో ఒరియా భాష | 5-50 |
| 30 రోజులలో సంస్కృత భాష | 5-50 | 30 రోజులలో ఉర్దూ భాష | 5-50 |
| 30 రోజులలో ఆంగ్ల భాష | 7-50 | 30 రోజులలో తమిళ భాష | 4-50 |
| 30 రోజులలో బెంగాళీ భాష | 4-50 | 30 రోజులలో పంజాబి భాష | 5-50 |

ఆంగ్ల సంభాషణం - తెలుగు వెల రూ. 7-50

మీరు పుస్తకాలకు ఆర్డర్ చేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి. మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue

Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014